Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి సెల్: 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 242 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :242 | శుక్రవారం 29 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4



10,350 మెట్రిక్ టన్నుల యూరియా


## నేడు గంగవరం పోర్టులో దిగుమతి

- యూరియా సరఫరాపై కేంద్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- జిల్లాలకు యుద్ధప్రాతిపదికన పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావుకు తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు
- సెప్టెంబర్ నెల మొదటి వారంలో కాకినాడ పోర్ట్ కు సుమారు మరొక 25000 మెట్రిక్ టన్నుల యూరియాకు తక్కువ కాకుండా సరఫరాకు కేంద్రం హామీ ఇచ్చింది

## వాణిజ్యం ఇప్పుడో ఆయుధం

టారిఫ్‌లపై రఘురాం రాజన్ కీలక వ్యాఖ్యలు
"టారిఫ్‌ల భారం భారత్‌కు ఓ మేలుకొలుపు లాంటిది
ఏ దేశంపైనా విస్తృతంగా ఆధారపడకూడదు
యూఎస్‌తో వాణిజ్యం కొనసాగిస్తూనే ఐరోపా, ఆఫ్రికా వంటి దేశాలపైనా దృష్టి సారించాలి






## 50 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

- ట్రక్కుల్లో కుళ్లిపోతున్న 50 కోట్ల ఖరీదైన యాపిల్స్
- వర్షాలు, కొండచరియలు విరిగిపడడం వల్ల హిమాచల్ ప్రదేశ్‌లో పరిస్థితి దారుణం
- వేల సంఖ్యలో రోడ్డుపై వాహనాలు
- కీలకమైన నిత్యావసరాలు తీసుకెళ్తున్న ట్రక్కులు చాలా రోజుల నుంచి కదలడం లేదు
- దీంతో ఢిల్లీ, ఎన్సీఆర ప్రాంతానికి సరఫరా దెబ్బతిన్నది
- చండీఘడ్-మనాలీ హైవేపై పలు ప్రాంతాల్లో రోడ్డు బ్లాక్

# రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు



- "కుటుంబ అవసరాలపై క్షేత్రస్థాయి సమాచారం తీసుకోవాలి
- ప్రభుత్వ సంక్షేమం అవసరమైతే వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలి
- ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు
- అందరికీ లబ్ధి కలిగేలా పథకాల రీడిజైన్ అంశం పరిశీలిద్దాం.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై ఏపీ సీఎం చంద్రబాబు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఆధార్ తరహాలో 'ఫ్యామిలీ కార్డు' ఇవ్వాలని సమీక్షలో నిర్ణయించారు. ఈ కార్డులో ప్రభుత్వ పథకాలు సహా అన్ని వివరాలు పొందుపర్చాలని, ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. "కుటుంబ అవసరాలపై క్షేత్రస్థాయి సమాచారం తీసుకోవాలి. ప్రభుత్వ సంక్షేమం అవసరమైతే వెంటనే అందేలా వ్యవస్థను సిద్ధం చేయాలి. ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి రాకూడదు.

## ఆన్‌లైన్ గేమింగ్ చట్టానికి 30న తొలి పరీక్ష!

- ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ తీవ్ర ఆందోళన, ప్రతిపక్షాల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఆన్‌లైన్ గేమింగ్ నిషేధ చట్టాన్ని తీసుకొచ్చింది కేంద్రం
- అయితే ఈ చట్టానికి న్యాయస్థానంలో తొలి పరీక్ష ఎదురుకాబోతోంది
- డబ్బు ప్రమేయం లేని ఈ-స్పోర్ట్స్‌కు మాత్రమే చట్టబద్ధత ఉంటుంది
- మానసికోల్లాసం, నైపుణ్యాభివృద్ధి కోసం సోషల్, ఎడ్యుకేషన్ గేమ్స్‌ను ఆడుకోవచ్చు.



# అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

- కృష్ణా పరివాహకంతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి
- సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలి
- అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీ వ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. కృష్ణా పరివాహకంతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. సహాయక చర్యలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకర హోర్డింగులు, కూలిన చెట్లను వెంటనే తొలగించాలన్నారు. మరోవైపు విద్యుత్ అధికారులతో ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

# ఫ్రీ బస్సు పేరిట ఘరానా మోసం



- చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం
- 'చంద్రబాబు మీ మోసాలతో అక్క చెల్లెమ్మలకూ వెన్నుపోటు పొడిచారు
- మహిళలకు ఫ్రీ బస్సు పేరిట హామీ ఇచ్చి, ఆ చిన్నహామీని కూడా మీరు మహిళలకు చెప్పినట్టుగా అమలు చేయడం లేదు
- ఎన్నికలకు ముందు సూపర్-6, సూపర్ -7 అంటూ అద్భుత సన్నివేశాలతో సినిమాలు, సీరియళ్లను మించి వీడియో ప్రకటనలతో మహిళలందర్నీ నమ్మించారు.
- అధికారంలోకి వస్తే.. జూన్ నుంచే హామీలు అమలు చేస్తామని ఇంటింటా బాండ్లు పంచి, 14 నెలలపాటు ఆ ఊసే ఎత్తలేదు.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు చేస్తున్న మోసాలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు మీ మోసాలతో అక్క చెల్లెమ్మలకూ వెన్నుపోటు పొడిచారు. మహిళలకు ఫ్రీ బస్సు పేరిట హామీ ఇచ్చి, ఆ చిన్నహామీని కూడా మీరు మహిళలకు చెప్పినట్టుగా అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. 'చంద్రబాబు మీ మోసాలతో అక్క చెల్లెమ్మలకూ వెన్నుపోటు పొడిచారు. మహిళలకు ఫ్రీ బస్సు పేరిట హామీ ఇచ్చి, ఆ చిన్నహామీని కూడా మీరు మహిళలకు చెప్పినట్టుగా అమలు చేయడం లేదు. ఎన్నికలకు ముందు సూపర్-6, సూపర్ -7 అంటూ అద్భుత సన్నివేశాలతో సినిమాలు, సీరియళ్లను మించి వీడియో ప్రకటనలతో మహిళలందర్నీ నమ్మించారు. అధికారంలోకి వస్తే.. జూన్ నుంచే హామీలు అమలు చేస్తామని ఇంటింటా బాండ్లు పంచి, 14 నెలలపాటు ఆ ఊసే ఎత్తలేదు. తీరా ఇప్పుడు అతిచిన్న హామీ అయిన ఉచిత బస్సు ప్రయాణంకూడా, అన్ని బస్సుల్లో కాదు, కొన్ని బస్సుల్లోనే ఉచితం అంటున్నారు. ఆ కొన్ని బస్సుల్లో కూడా సవాలక్ష ఆంక్షలు పెట్టారు. రాష్ట్రం అంతా కాదు, కొన్ని చోట్లకే అంటున్నారు. ఆర్టీసీలో 16 కేటగిరీ బస్సులు ఉంటే అందులో కేవలం 5 రకాల బస్సుల్లోనే, మొత్తంగా 11,256 - మిగతా3లో

## పండుగలాంటి వార్త..

# త్వరలో జిల్లా కమిటీల ప్రకటన

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కమిటీలను త్వరలో ప్రకటిస్తామని... రాష్ట్ర కమిటీ కూర్పుపై కసరత్తు చేస్తున్నామని ప్రకటించారు. పెన్షన్లు తెచ్చింది, పెంచింది మనమేనని ఉద్ఘాటించారు సీఎం చంద్రబాబు. రూ.500 ఉన్న దివ్యాంగుల పెన్షన్లను... రూ.6 వేలు చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేలు ఇస్తుంది మనమేనని ఉద్ఘాటించారు. మాట్లాడటానికే అర్హత లేని పార్టీ మన ప్రభుత్వాన్ని - మిగతా3లో





## చైనా పర్యటనకు ప్రధాని మోదీ

- జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం
- టియాంజిన్ లో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు.
- తొలిరోజు అంటే ఆగస్టు 31న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడి
- ప్రధాని మోదీ చైనాలో పర్యటించడం ఏడేళ్లలో ఇదే తొలిసారి.

## కుప్పంలో జిల్లా సహకార కేంద్రం బ్యాంక్
# మొబైల్ ఏటీఎం ప్రారంభం




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
నేటిడిజిటల్ యుగంలో గ్రామీణ మరియు పట్టణ ప్రజలకు బ్యాంకింగ్ సౌకర్యాలు మరింత చేరువ చేయడం కోసం కుప్పంలో జిల్లా సహకార కేంద్రం బ్యాంక్ మొబైల్ ఏటీఎంను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభకార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, తుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, చిత్తూర్ డిసిసి బ్యాంక్ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారామ్, మనోహర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకు లతో కలిసి పాల్గొన్నారు. మొబైల్ ఏటీఎం ప్రారంభంతో గ్రామీణ ప్రజలు నగదు ఉపసంహరణ, డిపాజిట్, బ్యాలెన్స్ చెక్ వంటి సేవలను తమ ప్రాంతంలోనే సులభంగా పొందగలరని తెలియజేశారు.

## ఘనంగా కుప్పం ఏఎంసి
# పాలకమండలి ప్రమాణ స్వీకారం




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ ) పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా, ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా జి.ఎం. రాజు చైర్మన్‌గా, ప్రియా శరవణ వైస్ చైర్మన్‌గా ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ వేడుకలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ,ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్. మునిరత్నం, తుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారామ్ , రాజకుమార్, ఎక్స్ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, సత్యేంద్ర శేఖర్, అలాగే తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. నూతన పాలకమండలికి అందరూ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ ప్రమాణ స్వీకారం ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది.

## శ్రీ శక్తి విజయోత్సవ సభను విజయవంతం చేయండి
## ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
అన్నమయ్యజిల్లా పీలేరు శ్రీశక్తి విజయోత్సవ సభ ఈనెల 30వ తేదీ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించే స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను నియోజకవర్గంలోని జిల్లా కమిటీ సభ్యులు ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జీలు,గ్రామ మరియు పట్టణ కమిటీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కన్వీనర్లు, నల్లారి అభిమానులు, నాయకులు, కార్య కర్తలు సభకు హాజరై విజయవంతం చేయాలని నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కోరారు.

## మోక్ష గణపతికి ప్రత్యేక పూజలు ఘనంగా అభిషేకాలు




**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 28:**
చౌడేపల్లి మండలం పంచాయతీ కేంద్ర మైన శెట్టి పేట బస్ స్టాప్ వద్ద కొలువై ఉన్న శ్రీ మోక్ష గణపతి దేవాలయంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని తొమ్మిది సంవత్సరాలు ముగించు కొని పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతూ ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత ప్రముఖ వ్యాపార వేత్త ముదిరాజు లక్ష్మీపతి రాజుఆలయంలో ప్రత్యేక వేద పండితులచే ప్రత్యేక రంగురంగుల పుష్పాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి వేద మంత్రాల నడుమ నాయి బ్రాహ్మణుల మంగళ వాయిద్యాలతో ఘనంగా అభిషేకాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు. అభిషేకం అనంతరం ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాలు, లడ్డు వేలం తినుబండారాల హారం వేలం ఊరేగింపు కార్యక్రమాలు ఘననియంగా నిర్వహించారు. లడ్డు వేలాన్ని శ్రీమోక్ష గణపతి ఆలయంలో గ్రామస్తులు అందరి సమక్షంలో లడ్డువేలాన్ని నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన లోకేష్ ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటూ వీడియో కాల్ ద్వారా 1,60,000కి హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. స్వామివారి ప్రసాదంగా భావిస్తున్నట్లు లోకేష్ వివరించారు. తరువాత స్వామివారి అలంకరణకు ఉపయోగించిన తినుబండారాల హారం ఒక్క హారాన్ని 20001రూపాయికి ఆనంద్ దక్కించుకున్నారు. ఇంకొక హారాన్ని 10102 రూపాయలు రెడ్డప్ప దక్కించుకున్నారు. శెట్టిపేట పంచాయతీ పరిధిలోని తోటకురపల్లి కొత్త ఇండ్లు ఎర్ర గానిపల్లి మేకల చిన్న పల్లి ముదిరెడ్డి పల్లి గ్రామాలలో అన్నిటిలో ఉత్సవ మూర్తి ఊరేగింపు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కోడిపందే గాళ్లపై పోలీసుల దాడిఇద్దరు అరెస్ట్

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28**



కోడిపందాలు ఆడుతున్న స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ బుటకపల్లి మురుకు గుంట కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చింది. వెంటనే వెళ్లి దాడి చేయగా కోడిపందాలు, ఆడు తున్న రామ్మూర్తి ఆనందంలో అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు రెండు కోడి కత్తులు రూ 1800 రూపాయలు స్వాధీనం చేసుకొని ఇద్దరు పై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

# మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు కావాలని మృత్యుంజయునికి పూజలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి అతి త్వరలో కేసుల నుండి విముక్తి కలగాలి అని వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ ఆధ్వర్యంలో చౌడేపల్లి శ్రీ అభీష్టద మృత్యుంజేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం ఉదయం 101 టెంకాయలు కొట్టి ,ప్రత్యేక అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా వైకాపా పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు, చౌడేపల్లిమండల జెడ్‌పిటిసి సభ్యులు దామోదర్ రాజు, వైకాపా పార్టీ మాజీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ అంజిబాబు , మండల ఉపాధ్యక్షులు నరసింహా రెడ్డి యాదవ్ ,మాజీ ఎంపీపీరెడ్డి ప్రకాష్, వైకాపా పార్టీ జిల్లా కార్యదర్శి ఉదయకుమార్ రెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షులు కృష్ణారెడ్డి వైకాపాపార్టీ గ్రీవేన్స్ కార్యదర్శి పవన్ కుమార్ వీరందరి సమక్షంలో పూజాకార్యక్రమం నిర్వహించారు. పూజాకార్యక్రమం అనంతరం వైస్సార్సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ మాట్లాడుతూ నేటి కూటమి ప్రభుత్వం పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ని సంబంధం లేని తప్పుడు కేసులో 40 రోజులకు పైగా ఆదారాలు లేకుండా నిర్బంధించడం సమంజసం కాదు అని ఇది కేవలం కక్షపూరితంగా ఉంది అని అన్నారు. రాజకీయాలకు అతీతంగా, కులాలు చూడ కుండా, మతాలు చూడకుండా అందరికి సహాయం చేసిన గొప్ప మనసున్న వ్యక్తి మా మిథున్‌రెడ్డి అని మరి అటువంటి వ్యక్తికి తొందరగా కేసుల నుండి విముక్తి కలగాలి అని ఆ భగవం తుణ్ణి కోరుకుంటు అన్నారు. ఈ కార్య క్రమంలో రాజా రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి,హరీష్ రాయల్, బాగ్యాలత హరి,రామబాణం శ్రీనివాసు లు, చరణ్ రెడ్డి ,ప్రమోద్ రెడ్డి, వెంకట రమణ రెడ్డి,షేర్ ఖాన్, సనాఉల్లా, చాంద్ బాషా, నాగేంద్రా ,మంజునాథ్, గోపి, రాంకీ, హరి గంగాధర్, డిష్ సూరి, హరి, వినోద్, మల్లికార్జునా, గోవర్ధన్, గణేష్,తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వైసిపి నాయకురాలికి తీవ్ర గాయాలు
## పరామర్శించిన మండల వైసిపి నేతలు




**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
కాకతి వద్ద జరుగుతున్న ఒక కార్యక్రమానికి వెళ్లి వస్తూ నియోజకవర్గ వైసిపి నాయకురాలు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పుంగనూరు నియోజక వర్గం ఎస్టీ మహిళా విభాగ అధ్యక్షురాలు అనుప్రియ 28 కాగతిలో జరుగుతున్న వైకాపా కార్యక్రమానికి పాల్గొని తిరిగి వస్తుండగా చిన్న కొండా మరి వద్ద తన టూ వీలర్ కు సునకాలు అడ్డు వచ్చాయి దీంతో టూవీలర్ అదుపుతప్పి కిందికి పడిపోయింది. ఈ ప్రమాదంలో అనుప్రియ కు తీవ్ర గాయాలు అయ్యాయి విషయం తెలిసిన వెంటనే మండల వైకాపా అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి నాయకులు తరలివచ్చి ఆమెను చౌడేపల్లి ఆటో తర్వాత మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైసిపి నాయకురాలిని తాము కాపాడుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణనాథునికి ఘనంగా పూజలు.



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ,ఆగస్టు 28:**
వీకోట పట్టణమే కాకుండా ప్రతి పల్లెలోను ఆది దంపతుల తనయుడు గణనాధునికి భక్తిశ్రద్ధలతో ప్రజలు మరియు విద్యార్థిని విద్యార్థులు మండపాలు విద్యుత్ కాంతులు మరియు పువ్వులు మొక్కలతో సింగారించి భక్తిశ్రద్ధలతో అతి వైభవంగా పూజల నిర్వహించినారు, అనంతరం భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలు పంపిణీ చేసినారు. గ్రామాలలో కాలాక్షపానికి కోలాటాలు, పండరి భజనలు, హరి భజనలతోపాటు పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినారు.

## ఎమ్మెల్యేను కలసిన సీఐ మురళీ మోహన్


**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**



పలమనేరు శాసనసభ్యులు అమరనాథరెడ్డిని పలమనేర్ అర్బన్ సిఐగా విధుల్లో చేరిన మురళీ మోహన్ గురువారం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. గంగవరం రూరల్ సీఐగా పని చేస్తున్న ఈయన బదిలీపై పలమనేర్ అర్బన్ స్టేషన్‌కు విచ్చేశారు. దీంతో విధుల్లో చేరిన అనంతరం ఎమ్మెల్యేను కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఐకు సూచించారు.

# గణనాధుడికి ప్రత్యేక పూజలు

**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**



గణేష్ చతుర్థి సందర్భంగా వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళుపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఉభయదా రుడు. గా వ్యవ హరించిన టిడిపి మండల కార్యదర్శి వెంకటేష్ గణేష్ చతుర్థి సందర్భంగా గణనాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శనం చేసుకున్న వెదురుకుప్పం టిడిపి నేత పెరుమాళ్ళుపల్లి మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి, స్థానిక సర్పంచ్ శశికళ ఆనందరెడ్డి, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు బోడిరెడ్డి, రామకృష్ణారెడ్డి, కోదండరామ స్వామి గుడి ఆలయ ధర్మకర్త రామ్‌ప్రసాద్, రెడ్డి, కృష్ణప్రసాద్, సి.ఈశ్వర్ రేడ్డి, పి.పుర్ణ చంద్ర రేడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, చెంగలపండు రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,చంద్రశేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## కొణతనేరి గ్రామంలో బొజ్జల బృందమ్మ ఘన స్వాగతం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం కొణతనేరి గ్రామపంచాయతీకి విచ్చేసి సీఎం రిలీఫ్ ఫండ్లు కార్యక్రమం.ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు కుటుంబాలకు బొజ్జల బృందమ్మ చేతుల మీదుగా చెక్కుల అందజేయడం హర్షనీయంగా ఉందని మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు, సర్పంచ్ గాలి శ్రీనివాస బాలాజీ నాయుడు, మాజీ సర్పంచ్ హరినాయుడు ఆధ్వర్యంలో పాలెపు కిరణ్ నాయుడు, సంద్ర చంద్రశేఖర నాయుడుకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ మిగతా వారందరికీ కూడా త్వరలోనే చెక్కులు వస్తాయని బృందమ్మ భరోసా కల్పించారు.అనంతరం గ్రామ మహిళలు, నాయకులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో దివంగత నేత బొజ్జల గోపాల కృష్ణారెడ్డి చేసిన అభివృద్ధి తప్ప గత ఐదు సంవత్సరాల కాలంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని వివరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ కొనతనేరి పంచాయతీ తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని స్కూల్ బిల్డింగ్ దగ్గర నుండి గ్రామంలో నికి సిమెంట్ రోడ్డు కావాలని, హరిజనవాడకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని అని అన్నారు.గాంధీ సెంటర్ నందు అంగన్వాడీ బిల్డింగ్ కు మరమ్మతులు , హౌసింగ్ కాలనీలు రావాలని గ్రామస్తులు కోరడంతో బృందమ్మ సానుకూలంగా స్పందించి అన్ని వసతులు కల్పిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర ఆమని, పంచాయితీ కార్యదర్శి చంద్రిక, వెల్ఫేర్ అసిస్టెంట్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో బద్రి లంకెళ్ళ

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్ , ఆగస్టు 28:**



శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల చిత్తూరు నివాసి అమెరికాలో స్థిరపడిన బద్రి లంకెళ్ళ కమిషనర్ మాడిసన్ మెట్రోపాలిటన్ సీవరేజ్, డిస్ట్రిక్ట్ కమిషన్ సభ్యులు కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి తెలుగుదేశం పార్టీనేత లక్కమనేని మధుబాబు, సీనియర్ రిపోర్టర్ షేక్ రఫీ స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం మేధా గురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద శేష వస్త్రంతో సత్కరించి వేదపండితుల చే ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని,తీర్థప్రసాదాలను అందచేశారు.

## వినాయక పూజలలో తెలుగుదేశం నేతలు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
శ్రీకాళహస్తి పట్టణం తెలుగుదేశం పార్టీ నేతలు నాగమల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలో పలు వార్డులలో వినాయక మండపాలలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. సంబంధిత వార్డు ప్రజలు తెలుగుదేశం నాయకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను సుఖ సంతోషాలతో జరుపు కోవాలని కోరారు. అన్ని వర్గాలు ప్రజలు కలిసిమెలిసి పండుగ జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నేతలు నాగమల్లి దుర్గాప్రసాద్, వి బాలాజీ, నాగమల్లి వినయ్ కుమార్, కిషోర్, సాయి, మస్తాన్, ఈశ్వర్, కోలా గోవర్ధన్, కిరణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## యోగ రాష్ట్ర పోటిలల్లో మరోసారి
## మాస్టర్ అయిలం సుజాతకు రెండు బంగారు పతకాలు




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
శ్రీకాళహస్తి ఆగస్టు 21, 24వ తేదీ తాడేపల్లిగూడంలో 6వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ యోగసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్- 2025 ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఛాంపి యన్షిప్ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో యోగ విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలోని శివసా యి యోగ సెంటర్ మాస్టర్ అయిలం సుజాతకు రెండు బంగారు పథకాలు ఉమెన్ సీనియర్ ఫోర్వర్డ్ బెండ్ విభాగంలో మొదటి స్థానం, ట్విస్టింగ్ బాడీ విభాగంలో మొదటి స్థానం సాధిం చింది. అలాగే త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా యోగ మాస్టర్ అయిలం సుజాత మాట్లాడుతూ యోగ వల్ల మన ఆరోగ్యం ఉల్లాసంగా, ఉలాత్సాహంగా ఉంటుంది. అలాగే జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. కావున ప్రతి ఒక్క యోగా ను అభ్యసించాలని కోరారు. అలాగే మాస్టర్ కు విద్యార్థులు మరియు పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

Cell: 9440352030 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# ఫ్రీ బస్సు పేరిట ఘరానా మోసం

-మొదటిపేజీ తరువాయి

బస్సులు ఉంటే అందులో కేవలం 6,700 బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణాన్ని పరిమితం చేశారు. ఈ బస్సుల్లో కూడా ఆంక్షలు పెట్టారు. 1,560 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉంటే, అందులో 950 నాన్ స్టాప్ బస్సులకు ఈ పథకం వర్తించదంటూ ఏకంగా బోర్డులు పెడుతున్నారు. ఇది అక్కచెల్లెమ్మలకు చేసిన మోసం కాదా? దగా కాదా? చంద్రబాబు ఇంతమోసం చేసికూడా మీరు చేస్తున్న ప్రచారాలు చాలా విడ్డూరంగా ఉన్నాయి. బస్సు ఎక్కితే చాలు మహిళలంతా లక్షాధికారులు అయిపోయినట్టుగా మీరు అంటున్న మాటలు విని మహిళలంతా నివ్వెరపోతున్నారు. 2014–19 మధ్య డ్వాక్రా రుణాల మాఫీ పేరిట మాయచేసి, చివరికి వడ్డీసైతం ఎగరగొట్టి, తర్వాత మీరు వెన్నుపోటు పొడిచిన ఆ రోజులను కూడా మహిళలంతా మరోసారి చర్చించుకుంటున్నారు. మా ఐదేళ్లకాలంలో మేం చేసిన మంచినీ గుర్తు చేసుకుంటున్నారు. మా ప్రభుత్వ హయాంలో దేశంలో తొలిసారిగా మేం ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకాన్ని తొలిఏడాది ఎగ్గొట్టారు. ఒక్కో ఏడాది ఒక్కో పిల్లాడికి రెండేళ్లకు గాను రూ.30 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.13 వేలే ఇచ్చారు. చాలా మంది పిల్లలకు అది కూడా అందలేదు. మొత్తం 87 లక్షల మంది పిల్లలకు ఇవ్వాల్సి ఉంటే, 30 లక్షల మంది పిల్లలకు కోతపెట్టారు. మహిళల స్వయం సాధికారత కోసం, వారి కాళ్లమీద వారు నిలబడేలా మేం హామీ ఇచ్చిన విధంగా ఆసరా కింద రూ.25,571 కోట్లు వారి చేతికే అందించాం. సున్నావడ్డీ కింద మరో రూ.5వేల కోట్లు అదనంగా ఇచ్చాం. చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు. మహిళల స్వయం ఉపాధికోసం చేయూత కింద ప్రతిఏటా ఆ అక్కచెల్లెమ్మలకు రూ.18,750ల చొప్పున 33,14,901 మందికి రూ.19,189.59 కోట్లు నేరుగా వారి చేతికే ఇచ్చి, అమూల్, పీ అండ్ జీ, హిందుస్థాన్‌లీవర్, మహీంద్రా, ఐటీసీ లాంటి ప్రఖ్యాత సంస్థలను బ్యాంకులతో అనుసంధానం చేస్తూ, వారి కాళ్లమీద వాళ్లు నిలబడేలా ప్రోత్సహిస్తూ, బ్రహ్మాండంగా అమలు చేశాం. ఎప్పుడూలేని విధంగా కాపు నేస్తం కింద 4,62,878 మంది కాపు అక్క చెల్లెమ్మలకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.2,029 కోట్లు, మేనిఫెస్టోలో మేం



పెట్టకపోయినా, అగ్రకులాల్లోని పేదలైన అక్క చెల్లెమ్మలకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున ఈబీసీ నేస్తం కింద మరో 4,95,269 మందికి రూ.1,876 కోట్లు ఇచ్చాం. 1.05 కోట్ల మంది మహిళలకు సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేసి, డ్వాక్రా రుణాలపై వారు కట్టాల్సిన వడ్డీని మా ప్రభుత్వమే భరిస్తూ రూ.4,969 కోట్లు చెల్లించాం. 31 లక్షలకు పైగా ఇళ్లపట్టాలు అక్కచెల్లెమ్మలకే ఇస్తూ వారి పేరు మీదే రిజిస్ట్రేషన్ చేశాం. ఇందులో ఏకంగా 22 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. మహిళా సాధికారతలో మా పరిపాలనా కాలం ఒక స్వర్ణయుగం, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయం, మా చిత్త శుద్ధికి నిదర్శనం.

చంద్రబాబు మీరు కొనసాగుతున్న ఈ పథకాలన్నింటినీ మీరు నిర్దాక్షిణ్యంగా రద్దు చేసి, మహిళలను మళ్లీ పేదరికంలోకి నెట్టి, లక్షలాది కుటుంబాలను దెబ్బతీశారు. చేయకూడని ద్రోహం చేస్తూ, పైగా ఇచ్చిన అరకొర బస్సుల్లో ప్రయాణిస్తే లక్షాధికారులు అయిపోతారంటూ మోసపుచ్చే మాటలు మాట్లాడుతున్నారు. మీరు చేస్తున్నది మోసం కాదా? దగా కాదా? అంతేకాదు మీరు ఏడాదికి ఇస్తానన్న 3 ఉచిత సిలిండర్ల పథకం కూడా ఈ మాదిరిగానే అఘోరించింది. గత ఏడాది మూడు సిలిండర్లకుగాను మీరు ఇచ్చింది ఒక్కటే. రాష్ట్రంలో 1.59 కోట్ల కనెక్షన్లు ఉంటే, ఏడాదికి మూడు సిలిండర్లకుగాను రూ.4,100 కోట్లు అవసరం. మొదటి ఏడాది ఇచ్చింది ఒక్క సిలిండర్. అదికూడా అందరికీ ఇవ్వలేదు. ఖర్చు చేసింది కూడా కేవలం రూ.764 కోట్లు. మిగిలిన 2 సిలిండర్లు ఎగ్గొట్టారు. ఇప్పుడు రెండో ఏడాది కూడా అంతే. మూడు సిలిండర్లకోసం రూ.4,100 కోట్లకుగాను ఇప్పటికి ఇచ్చింది కేవలం రూ.747 కోట్లే. ఇది మోసం కాదా? దగా కాదా? అందుకే బాబు ష్యూరిటీ%%% మోసం గ్యారంటీ!

# ఆడారికి కీలక పదవి
# తెలుగు తమ్ముళ్ల ఫైర్

**విశాఖపట్టణం :** అడారి ఆనంద్ కుమార్.. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు. కాషాయ కండువా కప్పుకున్న ఆరు నెలల్లోనే? అది కూడా ఎలాంటి సంఘ్ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా రాష్ట్ర స్థాయి కీలక పదవి లభించడం కమలదళంలో కొత్త ట్రెండ్. ఇప్పుడీ పరిణామం బీజేపీ కంటే టీడీపీ వర్గాల్లోనే ఆసక్తికరమైన చర్చకు తెరతీసింది. కారణం, రాజకీయంగా చెక్ పెట్టేందుకు జరిగిన ప్రయత్నాలను లాబీయింగ్ ద్వారా తిప్పికొట్టడంలో ఆనంద్ సక్సెస్ అవ్వడమేనంటున్నారు. టీడీపీతో ఆడారి ఫ్యామిలీది మూడున్నర దశాబ్దాల అనుబంధం. ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాలు విజయ విశాఖ కో ఆపరేటివ్ డెయిరీ చుట్టూ తిరుగుతుంటాయి. ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఎంపిక చేసేది టీడీపీ హైకమాండ్ అయినా తెరవెనుక వ్యూహాలను అమలు చేసి పార్టీకి విజయాలను అందించడంలో విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ అడారి తులసీరావుది కింగ్ మేకర్ ఇమేజ్. మాడుగుల, చోడవరం, పెందుర్తి, యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల్లో రైతులు, పాల డెయిరీ సంఘాలతో ఉన్న నెట్ వర్క్ కారణంగా? అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశించే స్థాయిలో ఆయన లాబీయింగ్ చేసేవారనేది టీడీపీ వర్గాల టాక్. ఈ కారణంతోనే డెయిరీ వ్యవహారాలపై వచ్చిన ఆరోపణల మీద 2004 ? 2009 మధ్య అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ నిర్వహించింది.అయితే, ఆ నివేదికలు., యా జమాన్యంపై తీసుకున్న చర్యలు బహిర్గతం కాకపోగా అసలు చర్చల్లోకి రావడం మానేసి చాలా కాలం అయింది. ఈ పరిస్థితుల్లో.. 2019ముందు తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ పాలిటిక్స్ ప్రారంభించారు తులసీరావు కుమారుడు అడారి ఆనంద్ కుమార్. తండ్రి కేవలం తెర వెనక రాజకీయం చేయగా.. ఆనంద్ మాత్రం ఆన్ స్క్రీన్ ఎంటరైపోయారు. 2019 ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ సీట్లో టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారాయన. రాజకీయ కుటుంబం, సామాజిక, ఆర్థికంగా పటిష్టంగా ఉండటంతో ఆనంద్‌పై ఆఖరి నిముషంలో అభ్యర్థిని మార్చి కొత్త స్కెచ్ వేసి సక్సెస్ అయింది వైసీపీ. అనూహ్యంగా గవర సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సత్యవతి అభ్యర్థిగా నిలిపిన ఫ్యాన్ పార్టీ భారీ విజయం నమోదు చేసింది. ఇక వైసీపీ అధికారంలోకి వచ్చాక కుటుంబ పాలనగా వున్న విజయ విశాఖ డెయిరీపై పాలకవర్గం మీద దృష్టి సారించిందనే ప్రచారం జరిగింది.ఆ ప్రచారం నడుమే.. ఎవ్వరూ ఊహించని విధంగా.. వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు ఆనంద్. తండ్రి టీడీపీకి స్టాండ్ అయితే కుమారుడు వైసీపీలో యాక్టివ్ పాలిటిక్స్ మొదలెట్టారు. గ్రేటర్ విశాఖపై పట్టు బిగించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ.. 2024





ఎన్నికల్లో విశాఖ పశ్చిమ నియోజకర్గంపై ఫోకస్ పెట్టింది. ఆ క్రమంలో టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గణబాబుపై పోటీ చేసిన ఆనంద్.. బలమైన అభ్యర్థిగా ప్రొజెక్ట్ అవ్వడంతో ఫలితాలు వచ్చే వరకు ఉత్కంఠ కొనసాగింది. కానీ, కూటమి వేవ్, వైసీపీ అంతర్గత రాజకీయాలు కారణంగా ఆనంద్ ఓడిపోయినట్టు చెప్పుకుంటారు. దీంతో ఆయన యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరం అవుతారని, వ్యాపారాలపైనే దృష్టి సారిస్తారనే ప్రచారం జరిగింది. అందుకు తగ్గట్టుగానే కొన్ని నెలలు కామ్‌గా ఉన్నారు అడారి. అదే సమయంలోలో కూటమి పార్టీలు కీలక ఆరోపణలను తెరపైకి తెచ్చాయివిశాఖ డెయిరీ నిధులు గోల్ మాల్ అయ్యాయని, కుటుంబ పాలన కారణంగా నష్టం జరుగుతోందని, పాడి రైతుల కష్టానికి ఫలితం లేకుండా పోతోందని ఆరోపించింది టీడీపీ. డెయిరీ యాజమాన్యం ప్రభుత్వ భూమిని కలిపేసుకుందంటూ జనసేన మరో విషయాన్ని బయటపెట్టింది. ఈ పరిణామాలన్నిటి మధ్య? విచారణ కోసం శాసనసభ లో పట్టుబట్టింది టీడీపీ. దీంతో విచారణకు హౌస్ కమిటీని నియమించారు స్పీకర్ అయ్యన్న పాత్రుడు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నేతృత్వంలోని కమిటీ క్షేత్ర స్థాయి పర్యటన జరిపి.. అసలు వచ్చిన ఫిర్యాదుల కంటే ఎక్కువ, ఇంకా తీవ్రమైన అవకతవకలు జరిగినట్టు అభిప్రాయపడింది. లెక్కలు తీసేందుకు సాంకేతిక సహకారం కూడా అవసరమని భావించింది. దీంతో విశాఖ డెయిరీలో అడారి ఫ్యామిలీ హవా ముగిసినట్టేనన్న ప్రచారం మొదలైంది. కీలకమైన డైరెక్టర్లు టీడీపీలోకి జంప్ అయిపోవడంతో డెయిరీ పాలిటిక్స్ ఆసక్తికరంగా కనిపించాయిఈ వ్యూహాలను ఆనంద్ ఎలా ఎదుర్కొంటారన్న చర్చ జరుగుతుండగానే మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారాయన. అనూహ్యంగా బీజేపీ తీర్థం పుచ్చేసుకోవడం?..దానికి పార్టీ ముఖ్య నాయకత్వం నుంచి పూర్తిస్థాయి సానుకూలత వ్యక్తం కావడం ఆసక్తికర పరిణామం. కేవలం డెయిరీ మీద పట్టు నిలబెట్టుకోవడం కోసమే ఆనంద్ సేఫ్ గేమ్ ఆడారన్న అభిప్రాయం వ్యక్తం అయింది. అదలా ఉండగానే? ఇప్పుడు అడారికి రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్ష పీఠం లభించింది. ఇది కూటమిలో ప్రధాన భాగస్వామిగా వున్న తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఊహించనిది. ఇప్పుడు కూడా టీడీపీ నాయకులు అడారి అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడతారా? మిత్రపక్షం రాష్ట్ర ఉపాధ్యక్షుడి మీద విచారణ కోరతారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పుడు హౌస్ కమిటీ విచారణ ఎంత సమర్ధవంతగా ముందుకు వెళుతుందన్నది బిగ్ క్వశ్చన్. అడారి ఎత్తును టీడీపీ చిత్తు చేస్తుందా? లేక మన కూటమిలోకి వచ్చేశాడు కదా అని సర్దుకుపోతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## అందరూ మిత్రులే...

**విజయవాడ :** ఏ రాష్ట్రంలోనైనా ప్రాంతీయ పార్టీలు ప్రత్యర్థులుగా ఉంటూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని ఒకరు మద్దతిస్తే, మరొకరు వ్యతిరేకిస్తారు. కానీ ఏపీ రాజకీయాల తీరు వేరు. 2014 లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ఇక్కడ ప్రధాన ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు కేంద్రంలో ఉండే బీజేపీ వైపు నిలుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో టీడీపీ నేరుగా బీజేపీతో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ కూడా కేంద్రంలో ఉన్న బీజేపీకి అనేక సందర్భాల్లో మద్దతుగా నిలిచింది. ఇక నాడు ప్రారంభమయిన దోస్తీ నేటి వరకూ కొనసాగుతూనే ఉంది. 2014లో కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీలు తర్వాత విభేదాలతో విడిపోయాయి. ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో నాడు బీజేపీని వ్యతిరేకించిన చంద్రబాబు దాదాపు ఐదేళ్లు ఢిల్లీకి వెళ్లలేదు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ పట్ల టీడీపీ సాఫ్ట్ కార్నర్ గా వ్యవరిస్తూ వచ్చింది. అంతేకాదు టీడీపీకి చెందిన రాజ్యసభ సభ్యులు నలుగురు బీజేపీలోకి వెళ్లిపోయారు. ఇక అప్పటి నుంచి నాడు అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మద్దతిస్తూ వస్తుంది.

## 10,350 మెట్రిక్ టన్నుల యూరియా నేడు గంగవరం పోర్టులో దిగుమతి

**అమరావతి :** రాష్ట్ర రైతాంగానికి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోక శుభవార్త తెలిపారు. యూరియా సరఫరా విషయంపై కేంద్ర వ్యవసాయ ఎరువుల రసాయనిక మంత్రితో మాట్లాడటంతో నేడు రాష్ట్రానికి 10,350 మెట్రిక్ టన్నుల యూరియా గంగవరం పోర్టునకు చేరుకుంటున్నదని మంత్రి అచ్చెన్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు సత్వరమే సానుకూలంగా స్పందించి రాబోయే సెప్టెంబర్ నెల 6 వ తేదీనాడు రావలసిన యూరియా సరుకును వారం ముందుగానే రాష్ట్రానికి సరఫరా చేసినందుకు కేంద్రానికి మంత్రి అచ్చెన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో త్వరితగతిన యూరియా రాష్ట్రానికి చేరుకుంటుందని అన్నారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ ( ఐ పి యల్) కంపెనీ ద్వారా ఈ ఎరువులను గంగవరం పోర్టులో దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ పంటల సాగు పరిస్థితి, వాటి దశలను బట్టి యూరియా అవసరాలను శాస్త్రీయంగా బేరీజు చేసుకుంటూ,ప్రణాళిక బద్ధంగా అత్యంత అవసరం ఉన్న ప్రాంతాలకు, తక్షణ పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ,వ్యవసాయ అధికారుల పూర్తి పర్యవేక్షణలో రైతులకు యూరియా ను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ కమీషనర్ డిల్లీ రావుకు మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ నెల మొదటి వారంలో కాకినాడ పోర్ట్ కు సుమారు మరొక 25000 మెట్రిక్ టన్నుల యూరియాకు తక్కువ కాకుండా సరఫరాకు కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి తెలిపారు . రైతులు యూరియా సరఫరా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ఖరీఫ్ సీజన్ కి యూరియా పుష్కలంగా లభిస్తుందని హామీ ఇచ్చారు . రైతులు వారి పంట తక్షణ అవసరాలకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, వచ్చే రబీ సీజన్ కు ముందుస్తు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని రైతులను మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులను ఇతర రాష్ట్రాలకు , పక్కదారి మళ్ళకుండా,అధిక ధరలకు అమ్మకుండా , నిఘా ఎన్ఫోర్స్మెంట్ ను మరింత కట్టుదిట్టం చేసి ,కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు . ప్రతి జిల్లాలో కలెక్టర్ , ఎస్పీల ఆధ్వర్యంలో వ్యవసాయ , పోలీసు ,విజిలెన్స్ ,రెవెన్యూ ,పరిశ్రమల అధికారులతో సంయుక్త టీమ్ లను ఏర్పరిచి తనిఖీలను చేస్తున్నామని తెలిపారు

## పండుగలాంటి వార్త.. త్వరలో జిల్లా కమిటీల ప్రకటన

-మొదటిపేజీ తరువాయి

విమర్శిస్తోందని చెప్పుకొచ్చారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని భరోసా కల్పించారు. అర్హులకు న్యాయం జరిగేలా పార్టీ యంత్రాంగం పని చేయాలని సూచించారు. పెన్షన్ల పంపిణీ సందర్భంగా ఇంటింటికీ వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఎంతో చేస్తున్నామని... చేసింది చెప్పుకుందామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

సమస్యలు ఎక్కడెక్కడ తలెత్తాయని ఆయన ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఒకట్రెండు చోట్ల మినహా పెద్ద ఇబ్బందులు తలెత్తలేదని అధికారులు ఆయనకు తెలిపారు. ఉత్తరాంధ్రలో నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలని అధికారులకు గొట్టిపాటి సూచించారు. వినాయక విగ్రహాల తరలింపు సమయంలోనూ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## ఆలోపతితో పాటు..

## ఇతర వైద్య సేవలు



**అనంతపురం :** ఏపీలో ఆయుష్ వైద్య సేవలను మెరుగుపరచడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని ఆరోగ్యశాఖా మంత్రి సత్య కుమార్ అన్నారు. ఆయుర్వేద, హోమియో, యూనాని, ప్రకృతి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆసుపత్రులను కొత్తగా ఏర్పాటుచేసేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోనే తొలి నేచర్ క్యూర్ వైద్య కళాశాల వైజాగ్ లో రాబోతుంది. ఇందులో 2026?27 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు ప్రారంభం కాబోతున్నాయి. విశాఖ, కాకినాడలో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు సిద్ధమవుతున్నాయి. అలాగే... విశాఖ నగరంలోనే ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగ శాల కూడా రాబోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం.. 2016?17లో నేచర్ క్యూర్ ఆసుపత్రి (ప్రకృతి వైద్య కళాశాల), రెండు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చూపుతున్న చొరవతో కాకినాడ ఆసుపత్రికి రూ.7.17 కోట్లు, విశాఖలో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రికి రూ.4.18 కోట్లు, నేచర్ క్యూర్ వైద్య కళాశాలకు రూ.4.08 కోట్లు మంజూరయ్యాయని వైద్య శాఖ ప్రకటన రిలీజ్ చేసింది. కేంద్రం నుంచి మూడు సంవత్సరాల తరువాత నిధుల విడుదల అవుతున్నాయనీ దీనివల్ల ఆయుష్ వైద్య సేవలు మెరుగుపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ అన్నారువిశాఖలోని విమ్స్ ప్రాంగణంలో రూ.16.40 కోట్లతో చేపట్టిన నేచర్ క్యూర్ వైద్య కళాశాలలో 2026?27 విద్యా సంవత్సరం నుంచి బ్యాచులర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగా సైన్సెస్ (బీఎన్వైఎస్) కోర్సులో తరగతులు ప్రారంభంకానున్నాయి. బీఎన్ వైఎస్ కోర్సులో 50 సీట్ల భర్తీకి కేంద్రం ఆమోదం తెలుపనుంది. ఈ కళాశాల పక్కనే.. రూ.14.85 కోట్ల వ్యయంతో 50 పడకలతో చేపట్టిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి నిర్మాణపనులు కూడా పూర్తయ్యేద శలో ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్య సేవలు ప్రజలకు త్వరలోనే అందుబాటులోనికి వస్తాయి. వీటి ఆధారంగా కేంద్రం అడ్మిషన్స్ కు అనుమతి ఇస్తునీది. గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ అయినందున అడ్మిషన్స్ త్వరగా స్టార్ట్ చేయడానికి వెసులుబాటు ఉంది.నేచర్ క్యూర్ వైద్య కళాశాల ఏర్పాటుకు తగ్గట్లు ప్రత్యేకంగా నేచర్ క్యూర్ ఆసుపత్రి ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 50 పడకలతో ఈ ఆసుపత్రి ఏర్పాటుపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. సుమారు రూ.16 కోట్లు కేంద్రం నుంచి రానున్నాయి.విశాఖలోని శొంఠ్యాం ప్రాంతంలో సుమారు రూ.6 కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ లేబరోరేటరీల భవన నిర్మాణాలు పూర్తికావొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సుమారు రూ.5 కోట్లతో పరికరాలు, యంత్రాలు, ఇతర వాటి కొనుగోళ్ల ప్రక్రియ జరగనుంది.కాకినాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 50 పడకలతో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్య సేవలు ఇక్కడ ప్రారంభించేందుకు వీలుగా అవసరమైన వైద్య పరికరాలు, యంత్రాల కొనుగోళ్లు జరుగుతున్నాయి. మూడు నెలల్లోగా ఈ ఆసుపత్రి సేవలు ప్రజలకు అందుబాటులోనికి రానున్నాయి.నేషనల్ ఆయుష్ మిషన్ కింద కాకినాడలో ఆయుర్వేద వైద్య కళాశాల, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆయుర్వేద వైద్య కళాశాలల ఏర్పాటుఆమోదం కోసం కేంద్ర ఆయుష్ శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ వెల్లడించారు. ధర్మవరంలో ఆయుర్వేద కళాశాలకు అనుబంధంగా ఉండాల్సిన ఆయుర్వేద ఆసుపత్రిని 50 పడకలతో ఏర్పాటుచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. మంత్రి సత్యకుమార్ ధర్మవరం నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

# ల్యాప్‌టాప్ దొంగల ముఠా అరెస్ట్
# పోలీసులు కాపాడిన విద్యార్థుల భవిష్యత్తు

**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28 :**
జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రవి మనోహరా చారి పర్యవేక్షణలో, డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి మరియు ప్రత్యేక బృందం సాంకేతిక పరిజ్ఞానంతో ల్యాప్‌టాప్ దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. గురువారం రేణిగుంట పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రెస్ మీట్ సమావేశంలో ఏఎస్పీ రవి మనోహర చారి మాట్లాడుతూ ఎర్పేడు మండలంలోని ఐఐటీ తిరుపతి కళాశాలలో ఇటీవల వరుసగా ల్యాప్‌టాప్ దొంగత నాలు చోటుచేసుకున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. దొంగల ముఠాను పట్టుకొని వారి వద్ద నుండి సుమారు 8 లక్షల విలువైన 15 ల్యాప్‌టాప్‌లు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తమిళనాడుకు చెందిన తమిళ్ సెల్వన్ మరియు కోయంబత్తూరుకు చెందిన వీరస్వామి గణేష్గా గుర్తించారు. వీరిపై ఇప్పటికే తొమ్మిది దొంగతనాల కేసులు నమోదు అయ్యాయి. బెంగళూరు, చెన్నై, నాగపూర్, జోధాపూర్, గోపాల్ వంటి పలునగరాల్లో ల్యాప్ టాప్ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడిం చారు. ఏఎస్పీ రవి మనోహరా చారి మాట్లాడుతూ“విద్యార్థుల ల్యాప్ టాప్‌లను రికవరీ చేసి వారిని ఆదుకోవడంలో పోలీసులు విజయవంతమయ్యారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం” అని తెలి పారు. ఈ ఆపరేషన్‌లో



పాల్గొన్న పోలీసు సిబ్బంది ని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్రమం లో రేణిగుంట సీఐ జయ చంద్ర, ఏర్పేడు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ట్రైని ఎస్సై స్వాతి, ఇమామ్ హుస్సేన్, వెంకట లక్ష్మి, రాజశేఖర్, బారుషా,మహేంద్ర బాలు, మణి, మునీంద్ర, కార్తీక్,నాయక్ తదితర పోలీసులు పాల్గొన్నారు.

## వైభవంగా గణేష్ నిమర్జనం కార్యక్రమం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
అన్నమయ్యజిల్లా పీలేరు ప్రతి ఏడాది ఆనవాయితీగా సాగే పీలేరు బ్రాహ్మణ సామూహిక గణేష్ నిమజ్జన కార్యక్రమం శివరామపురంలో గల శ్రీ భ్రమరాంబా సమేత శ్రీ మల్లేశ్వర స్వామి దేవ స్థానం వద్దగల గార్గేయ నది ఒడ్డున అత్యంత ఉత్సాహంగా ఆనందోత్సవాలతో నిమర్జనో త్సవం జరిగినది. గార్గేయ నది ఒడ్డున వినాయక విగ్రహాలను ఉంచి వేద పండితులు అందరూ షోడశ గౌరీ దేవి పూజ, గణపతి పూజ గావించి హారతులు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీదేవి, గణేశుడి పై భక్తి గీతాలను ఆలపించారు. హిందూ సంప్రదాయం ప్రకారం గణేషుడి విగ్రహాలను ప్రవహించే నీటిలో గానీ, కాలువలు లేదా ఏదైనా చెరువులో నిమజ్జనం చేయడం శ్రేష్టమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు తెనాలి రామ సుబ్రహ్మణ్యం, ప్రభా కర్ రావు, కె.వెంకటేశ్వర్లు, మయూరినాథ్, విరూపాక్షం కాశీనాథ్, నరసింహ మూర్తి, అప్ప య్యబట్ల శ్రీధర్,కృష్ణ ప్రసాద్, టీచర్ ప్రసాద్, చంద్రశేఖర్ స్వామి కరణం రామ్మూ ర్తి, సత్యనా రాయణ రావు, ఆంజనేయ శర్మ, ఎ.సాయి, కొని దెన శివప్రసాద్, జి శ్రీధర్, బాలా చార్, తది తరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ మార్పు



**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ,ఆగస్టు 28.**
వీ.కోట పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి 8 గంట లలోపు పట్టణంలో ఉన్న అన్ని విగ్రహాలను నిమజ్జనం సందర్భంగా వి కోట పట్ట ణంలో ట్రాఫిక్ రూల్స్ మార్చడమైనది. కావున ప్రజలు గమనించి పోలీస్ శాఖకు సహకరించాలని, నిమజ్జనం సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు, సిసి కెమెరాలతో ప్రతి అణువణువు పోలీసుల పర్యవేక్షణలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నమోదు చేయబడు తుందని కావున ప్రజలు, భక్తులు సహకరించి భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా వినాయక నిమర్జ నాలను ముగించాలని అలాగే నిమజ్జనం సందర్భంగా చిన్న పిల్లలను నీటి గుంటల వద్దకు గాని నిమజ్జన ఊరేగింపులోగాని తీసుకొనిరాకూడదని, పట్టణంలో విగ్రహాల ఊరేగింపు సందర్భము లో ఆకతాయిలు కాని వేరే ఇతరులుకానీ అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే పూర్తి బాధ్యత ఆయా విగ్రహాల ఆర్గనైజర్లపైన బాధ్యత ఉంటుందని, పోలీస్ ఆక్ట్ ప్రకారము అలాంటి వ్యక్తుల పైన కేసుల నమోదు చేయడానికి, ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని కావున భక్తి తో వినాయక నిమజ్జనాలను భక్తి శ్రద్ధలతో ముగించాలని పోలీస్ శాఖ వారు ప్రజలనుకోరారు.

## కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో
## బీసీ బాలికల వసతి గృహానికి వాటర్ ఫిల్టర్ వితరణ



**వీకోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వికోట బీసీ బాలికల వసతి గృహంలో వాటర్ ఫిల్టర్ వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వికోట అర్బన్ సిఐ సోమశేకర్ రెడ్డి, కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ అధినేత డా.ఎం.పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అన్నారు.అదేవిధంగా విద్యార్థులకు ఏమైనా సమస్యలు పోలీస్ వారికి తెలియచేస్తే మేము కూడా సహాయం చేయడానికి ముందు ఉంటాం అని అన్నారు. డా.పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే సులభంగా విజయం సాధించవచ్చు అని అన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ వికోట శాఖ అధ్యక్షుడు ఇమ్రాన్ జన్మదిన సందర్భంగా వాటర్ ఫిల్టర్‌ను కళ్యాణ్ ఫౌండేషన్ ద్వారా వసతి గృహానికి సి ఐ, కళ్యాణ్ ఫౌండేషన్ అధినేత చేతుల మీదుగా అందించారు. విద్యార్థులు కళ్యాణ్ ఫౌండేషన్ అధినేత డా.ఎం.పవన్ కళ్యాణ్ కి, ఇమ్రాన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోజ్, పవన్, దినేష్, జయంత్, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.ం

## నేడు కుప్పంకు సీఎం చంద్రబాబు
### చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**శాంతీపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో రెండు రోజుల పర్యటన లో భాగంగా ఆగస్టు 29, 30న కుప్పంకు విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఆగస్టు 29న బెంగళూరు విమానాశ్రమ నుండి బయలుదేరిసా 6.00 గం.లకు శాంతిపురం మండలం తుంసిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారని, అనంతరం శాంతిపురం మండలంలోని ముఖ్యమంత్రి శివపురం స్వగృహమునందు ఆరోజు రాత్రి బస చేస్తారు,ఆగస్టు 30 ఉ. 10.00 గం.లకు కడపల్లె, శాంతిపురం మండలం నందు ఉదయం సమయంలో స్వగృహం నుంచి బయలుదేరి హంద్రీనీవా కాలువ పరమ సముద్రం గ్రామానికి ఉ.10.30 గం.లకు గంగ హారతి కార్యక్రమంలో పాల్గొని, అనంతరం ఉ.11.15 గం.లకు పరమ సముద్రం చెరువు పక్కన గల బహిరంగ సభకు చేరుకుని, ఉ. 11.20 గం.లకు అవగా హన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొని, ఉ. 11.50గం.లకు బహిరంగ సభలో ప్రసంగి స్తారు. అనంతరం మ. 2.00 గం.లకు పారిశ్రామిక వేత్తలు మరియు ఇతర విశిష్టులతో సమావేశంలో పాల్గొని, మ. 3.45 గం. లకు రోడ్డు మార్గంలో బహిరంగ సభ నుంచి పరమ సముద్రం గ్రామం నందు గల హెలిపాడ్ వద్దకు చేరుకొని 3.55 గం.లకు హెలికాప్టర్‌లో 4.40 గం. లకు బెంగళూరుకు చేరుకోవడం జరుగుతుందని ఆ ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఆరిమాని గంగమ్మ గుడి హుండి ఆదాయం 2,46,739



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
ఎస్ ఆర్ పురం మండలం ఆరి మాకుల పల్లిలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ హుండి ఆదా యం రెండు లక్షల 46 వేల 739 రూపాయలు వచ్చిందని ఆలయ ఈవో వెంకట్రాయలు తెలి పారు. ఈ సందర్భంగా ఈవో వెంకటరాయలు మాట్లాడుతూ ఆరిమాను గంగమ్మ గుడి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాననీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వహుకులు హిమా చలపతి రెడ్డి, జలేంద్ర నాయుడు మాజీ ఎంపీటీసీ వెంకటరమణ లోకేష్ దశరాజు, ఆలయ సిబ్బంది, ప్రకాష్ ,పాయకట్టుదారులు పాల్గొన్నారు.

## సేనతో సేనాని సభను విజయవంతం చేయండి
### కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లా,జనసేన నాయకులు..



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో 2024 సార్వత్రిక ఎన్ని కల్లో 21కి21 సీట్లు గెలిచి 100% స్ట్రైక్ రేట్‌తో జనసేన పార్టీ చారిత్రాత్మక విజయం సాధించిన విషయం అందరి కీ తెలిసిందే. జనసేన పార్టీ ప్రస్తుతం రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం కొరకు, జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుండి 30వ తేదీన విశాఖపట్నంలో జరగబోయే సేనతో సేనాని సభ నిర్వహిస్తున్న తరుణంలో చిత్తూరు జిల్లా నుండి క్రియాశీలక సభ్యులు, జనసైనికులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొని సభని దిగ్విజయం చేయాలని కుప్పం నియోజకవర్గం జనసేన నాయకులు డాక్టర్ నరేష్ పిలు పునిచ్చారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత జనసేనాని పవన్ కళ్యాణ్ దాదాపు 14వేల పై చిలుకు క్రియాశీలక వాలంటీర్లతో ముఖాముఖిగా మాట్లాడే ఈ గొప్ప కార్యక్రమంలో అందరూ పాల్గొని భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని తెలిపారు. జనసేన పార్టీ బలోపేతం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, భవిష్యత్తులో ఆంధ్రా రాజకీయాల్లో జనసేన కీలక పాత్ర పోషించ బోతున్నదని దీనికొరకు జనసైనికులందరూ కృషి చేయాలని కోరుతున్నామని తెలిపారు. 28 నుండి 30వ తేదీ వరకు వైజాగ్‌లో జరిగే సేనతో సేనాని సభను అందరూ కలిసి విజయవంతం చేయాలని, దీనికి ప్రతి ఒక్కరికి ప్రత్యేక పిలుపునిచ్చిన కుప్పం నియోజకవర్గ జనసేన నాయకు లు డాక్టర్ నరేష్

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి
## చెరువులో శవం లభ్యం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28 :**
అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన రేణిగుంట మండలంలోని వెంకటా పురం గ్రామం చెరువు వద్ద జరిగింది. పోలీసు లు, వీఆర్వో సమాచారం మేరకు రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చెరువులో ఉన్న మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి వయసు 40 నుండి 50 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, మృతుడు ఎల్లో కలర్ షర్టు, నీలం కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నా డని మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే రేణిగుంట అర్బన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## రేణిగుంట లో ఘనంగా
## వినాయక చవితి ఉత్సవాలు
### -స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం,



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28 :**
రేణిగుంట జిఎం స్టేట్‌లో శ్రీఅభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం మధ్యా హ్నం వినాయక బిల్డర్స్ యాజమాని పల్లపు కిషోర్ వారి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిం చారు. శ్రీఅభయ వినాయక అసో సియేషన్ సభ్యులు భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుం డా చర్యలు చేపట్టారు. పల్లపు కిషోర్ కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వ హించి అన్న దాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామివారిని రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డిసిసిబి మాజీ అధ్యక్షుడు సిద్దగుంట సుధాకర్ రెడ్డి దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు అతిథులను స్వాగతం పలికి దర్శనం అనం తరం తీర్థ ప్రసాదాలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీఅభయ వినాయక అసో సియేషన్ అధ్యక్షులు లక్ష్మణ్, ముఖ్య సలహాదారులు జూలియన్ రాజు కమిటీ సభ్యులు సుమన్, పవన్, కళ్యాణ్,దినేష్, ప్రభు, నూతన్, గాలి రఘు,ఈ పి సురేష్, మస్తాన్, గణేష్, ధనుంజయ, ప్రదీప్, సురేష్ లు పాల్గొన్నారు.

## కుప్పం యువత చే రక్తదాన శిబిరం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 28:**



శ్రీవిద్యాగణపతి సేవ సంఘం, పాలస్ రోడ్, కుప్పం సభ్యులు మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ చే గణపయ్యను ప్రతిష్టించిన ఆవరణంలో కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి, పీఇ ఎస్ హాస్పిటల్ వారిచే రక్తదాన శిబిరాన్ని ఏర్పా టు చేసారు. ఈ శిభిరానికి 31 మంది హాజర యి రక్తదానం చేసారు. ఈ సందర్భంగా లయ న్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ అడ్వైజర్ మహే ష్ మాట్లాడుతూ భారతదేశంలో రోజుకు సుమారు 12,000 మంది రక్తం దొరకక చని పోతున్నారని, ఇలాంటి సందర్భంలో యువత ముందుకు వచ్చి ఈ వినాయక చవితి ఉత్సవాల లో భాగంగా రక్తదానం చేయడం నిజంగా ఆ దేవుని ఆశీసులు పొందగల సాయం అని యువకులను అభినందించారు. అలాగే పాల్గొన్న దాతలకు టీ షర్ట్స్ మరియు సర్టిఫికెట్స్ ఇచ్చి వారిని ప్రోత్స హించారు. ఈ కార్యక్రమంలో డా.హరిప్రియ, డా .జనని, డా .నీలిమ లయన్స్ క్లబ్ సభ్యులు డా .వరదరాజులు, పిఆర్ఓలు వెంకటేష్, ప్రసాద్, శ్రీవిద్యాగణపతి సేవసంఘం సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తూపిలిపాలెంలో గణేష్ నిమజ్జనోత్సవ ఏర్పాట్లు
## - సబ్ కలెక్టర్, డీఎస్పీ పరిశీలన



**వాకాడు చిత్తూరు ఎక్స్ ప్రెస్, :**
తిరుపతి జిల్లా వాకాడు మండల పరిధిలోని తూపిలిపాలెం గ్రామం ఉన్నటువంటి బంగాళాఖాతం సముద్ర తీరంలో గణేష్ నిమజ్జనోత్సవ ఏర్పాట్లను సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, డీఎస్పీ గీతా కుమారి గురువారం మధ్యాహ్నం పరిశీలించారు. గురువారం నుంచి ప్రారంభమైన గణేష్ నిమజ్జనోత్సవాల నేపథ్యంలో, భక్తుల సౌకర్యార్థం వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను అధికారులు సమీక్షించారు. అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు నివారించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించాలని, బందోబస్తును మరింత బలోపేతం చేస్తామని డీఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు.సబ్ కలెక్టర్ వాలంటీర్లకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ రఫీ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎఫ్‌డీవో రెడ్డి నాయక్, ఎస్సై నాగబాబు, ఆర్ఐ అఖిల్ యాదవ్‌లకు సూచనలు జారీ చేశారు. బహిరంగ మద్యం సేవనంపై నిషేధం విధించగా, సముద్రంలో నియంత్రణకు మించి వెళ్లిన వారిని కఠినంగా శిక్షిస్తామని అధికారులు హెచ్చరించారు.పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని,వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటాయని సబ్ కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రెండు బోట్లు సముద్రంలో ఉండగా, రేపటి నుంచి ఐదు బోట్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143